పుణ్యస్నానాలకు సర్వం సిద్ధం

- ఏటిపాయ, పెదపులిపాకలో ఏర్పాట్లు పూర్తి
- బారికేడ్లు నిర్మాణం
- అందుబాటులో గజఈతగాళ్లు
- పిండ ప్రదానాలకు ప్రత్యేక ఏర్పాట్లు



ఏటిపాయలో ముస్తాబైన రుద్రేశ్వర స్వామి వారి ఆలయం;



పెదపులిపాకలో ఘాట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రణవి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు



యనమలకుదురులో సిద్ధమవుతున్న ప్రభ

కంకిపాడు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పుణ్యస్నానాలకు మద్దూరు ఏటిపాయ సిద్ధమైంది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం తలెత్తకుండా పుణ్యస్నానాలు ఆచరించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటిపాయలో బారికేడ్లు ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితుల్లో గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. పితృదేవతలకు పిండ ప్రదానాలు చేసుకునేందుకు వీలుగా ఏటిపాయ ఒడ్డున భారీ ఎత్తున టెంట్‌లను ఏర్పాటుచేశారు.

మండలంలోని మద్దూరు గ్రామ పరిధిలోని కృష్ణానది ఏటిపాయలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఈనెల 26న మహాశివరాత్రి కావటంతో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వీలుగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా 50 వేల మందికి పైగా భక్తులు మద్దూరు పాయలో పుణ్యస్నానాలు ఆచరించనున్నట్లు అధికారుల అంచనా. అందుకు వీలుగా మద్దూరు పుష్కర ఘాట్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఏటిపాయ ఒడ్డున వ్యర్థాను తొలగించి వాహనాల పార్కింగ్, పితృదేవతల పిండప్రదానాలకు టెంట్లను సిద్ధం చేశారు. ఏటిపాయలో పుణ్యస్నానాలకు వచ్చే భక్తులు ఏటిపాయలో ప్రమాదాల బారిన పడకుండా సురక్షితంగా ఉండే ప్రాంతాన్ని గుర్తించి బారికేడ్లు నిర్మించారు. నిర్దేశిత ప్రాంతంలోనే పుణ్యస్నానాలు ఆచరించేలా సూచనలు ఇస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, మహిళలు దుస్తులు మార్చుకునే ప్రాంగణాలను ప్రత్యేకంగా సిద్ధం చేశారు. పారిశుద్ధ్య పరిరక్షణ చర్యలను పంచాయతీ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఏటిపాయలో భక్తులకు అత్యవసర సేవలు అందించేందుకు ప్రత్యేకంగా పడవలు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు.



పిండ ప్రదానాల నిర్వహణకు సిద్ధంచేసిన టెంట్లు

ముస్తాబైన రుద్రేశ్వర స్వామి ఆలయం..

ఏటిపాయలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఏటిపాయ ఒడ్డున ఉన్న రుద్రేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అంతేకాకుండా ఇక్కడే ఉన్న శివలింగానికి భక్తులే స్వయంగా పూజాది కార్యక్రమాలు చేసుకుంటారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు, ఆలయాన్ని సిద్ధం చేశారు.

పెదపులిపాకలో నదీ స్నానాలకు ఏర్పాట్లు

పెనమలూరు: మహాశివరాత్రి పండుగ సందర్భంగా భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్య స్నానాలు చేయటానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. పెదపులిపాక ఘాట్‌ను గ్రామ పంచాయతీ అధికారులు జేసీబీతో శుభ్రం చేశారు. నదిలోని ఉన్న చెత్త తొలగించారు. నదిలో నీటి ప్రవాహం ఘాట్ వద్ద లేనందున భక్తులు జల్లు స్నానాలు చేయటానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే పితృదేవతలకు పిండ ప్రదానం చేయటానికి ప్రత్యేకంగా షామియానా, వసతులు కల్పించారు. నదిలో స్నానాలు చేసే భక్తులు అప్రమత్తంగా ఉండాలని ఈవో వెంకటరత్నం తెలిపారు. ఘాట్ వద్ద పనులను ఎంపీడీవో బండి ప్రణవి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, సర్పంచి గుంటూరు శ్రీనివాసచౌదరి పరిశీలించారు.

మహాశివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు

గన్నవరం: మహాశివరాత్రి పర్వదిన వేడుకలకు మండలంలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. స్థానిక కోనాయి చెరువు వద్ద ఉన్న శ్రీకాశీవిశాలాక్షి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆది దంపతుల శాంతి కల్యాణోత్సవం, 10 వేల మందికి అన్నసంతర్పణ నిమిత్తం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కేసరపల్లి శివారు గుమ్మడి నాగేంద్రక్షేత్రంలోని శ్రీసోమలింగేశ్వరస్వామి ఆలయం, దావాజిగూడెం, కేసరపల్లిలోని శివాలయాలను మహాశివరాత్రి వేడుకలకు సిద్ధం చేశారు.

యనమలకుదురులో ప్రభలు సిద్ధం..

యనమలకుదురులో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో పెద్ద ఎత్తున ప్రభోత్సవం చేయటానికి ప్రభలు సిద్ధం చేశారు. ప్రభలకు రంగు కాగితాలు అంటించి, రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. నేడు ప్రభలను రథాల పైకి ఎక్కిస్తారు. దేవుడి ప్రభ గిరి ప్రదక్షిణ ప్రారంభం కాగానే ఇతర ప్రభలు కూడా ప్రభోత్సవంలో భాగంగా గిరి ప్రదక్షిణ చేస్తాయి.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు..

ఏటిపాయలో పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. నిర్దేశిత ప్రదేశంలో పుణ్యస్నానాలు చేసేందుకు వీలుగా బారికేడ్లు ఏర్పాటు చేశాం. పిండ ప్రదానాలకు టెంట్లు, దుస్తులు మార్చుకునే ప్రత్యేక సదుపాయాలను సమకూర్చాం. పారిశుద్ధ్య పరిరక్షణ చర్యలు తీసుకోవటం జరిగింది. మద్దూరు పుష్కర ఘాట్‌ను మహాశివరాత్రి పుణ్యస్నానాలకు సిద్ధం చేశాము.

– చింతా కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, మద్దూరు

క్లుప్తంగా

యనమలకుదురులో భక్తులు అప్రమత్తంగా ఉండాలి

పెనమలూరు: యనమలకుదురులో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు భద్రత ప్రమాణాలు పాటించాలని విద్యుత్ ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ ప్రభోత్సవం సమయంలో ప్రభలు విద్యుత్ లైన్లకు దూరంగా ఉండే విధంగా చూడాలన్నారు. ప్రభలకు ఏర్పాటు చేసే విద్యుత్ లైట్లు సక్రమంగా ఉండే విధంగా భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. భక్తులు విద్యుత్ వైర్లకు, ట్రాన్స్‌ఫారాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వెంటనే 94906 15674 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం తెలపాలని కోరారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నాపత్రాలు



పెనమలూరు: పెనమలూరు పోలీస్‌స్టేషన్‌కు ఇంటర్ ప్రశ్నాపత్రాలు మంగళవారం వచ్చాయి. ఇంటర్ పరీక్షలు వచ్చే నెల 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరగనున్నాయి. మండల పరిధిలో 20 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. దాదాపు 15 వేల మంది వరకు విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. పరీక్ష పత్రాలు పోలీస్‌స్టేషన్‌కు రావటంతో అధికారులు, పోలీసులు వివరాలు నమోదు చేసుకొని పోలీసుల కస్టడీలో ఉంచారు. పరీక్షల రోజున రెండు గంటల ముందు ప్రశ్నాపత్రాలు ఆయా పరీక్ష కేంద్రాలకు రూట్ అధికారులు తీసుకు వెళతారు. విద్యార్థులకు ఇప్పటికే హాల్ టికెట్లు పంపిణీ చేశారు.

రోడ్డు నిర్మాణం పనుల పరిశీలన



పి.నైనవరం(విజయవాడరూరల్): పి.నైనవరం గ్రామంలో జరుగుతున్న సిమెంటు రోడ్డు నిర్మాణం పనులను ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.మురళీ కృష్ణ ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. 15వ ఆర్థిక సంఘం నిధులు 15 లక్షల రూపాయలతో అంతర్గత సిమెంటు రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ప్రాథమికోన్నత పాఠశాల, అక్కడ నుంచి బి.వెంకటేశ్వరరావు ఇంటి వరకు సిమెంటు రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ ఏఈ ఎస్.శివరామకృష్ణ, ఇంజినీరింగ్ సహాయకులు లతీఫ్ పనులు పర్యవేక్షించారు.

బ్యాంక్ సిబ్బందిపై దౌర్జన్యం.. కేసు నమోదు

పెనమలూరు: కానూరులో బ్యాంక్ సిబ్బందిపై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో కెనరా బ్యాంకు శాఖ ఉంది. బ్యాంక్‌లో గొర్రిపాటి నాగరామకోటేశ్వరరావు అనే వ్యక్తి రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే అతను డాక్యుమెంట్లు అందజేయక పోవటంతో రుణం మంజూరు జరగలేదు. దీంతో నాగరామకోటేశ్వరరావు సోమవారం బ్యాంకు వచ్చి రుణం విషయమై బ్యాంక్‌లో మహిళా ఉద్యోగిని ఎం.వెంకటరమణపై దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడి దౌర్జన్యం చేశాడు. అడ్డుకున్న బ్యాంక్ సిబ్బందిపై కూడా దౌర్జన్యానికి పాల్పడ్డాడు. బ్యాంకు ప్రధాన డోర్‌ను ధ్వంసం చేశాడు. ఈ ఘటనపై బ్యాంక్ ఆఫీసర్ రాకేష్‌సూరి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులు పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి



ఉంగుటూరు: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఎంఈవో-2 జె.సాంబశివరావు అన్నారు. మండల కేంద్రమైన ఉంగుటూరులోని జెడ్పీ హైస్కూల్ 79వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పాఠశాలలో విద్యావిధానం, విద్యార్థుల సామర్థ్యం తల్లిదండ్రులకు తెలియజేయటానికే పాఠశాలల్లో వార్షికోత్సవాలు నిర్వహిస్తారని చెప్పారు. పదో తరగతి విద్యార్థులు చదువుపై దృష్టిపెట్టి నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం మూడు నుంచి పదో తరగతి వరకు తరగతుల్లో చదువులో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు, హాజరు శాతం ఎక్కువ ఉన్న వారికి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. బాల, బాలికలు ప్రదర్శించిన పలు సాంస్కృతిక నృత్యాలు చూపరులను అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం అనిత, విద్యాకమిటీ చైర్మన్ పులి శ్రీనివాసరావు, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జ్ఞాన జ్యోతి శిక్షణను సద్వినియోగం చేసుకోండి



జ్ఞాన జ్యోతి శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో శేషగిరిరావు

ఉయ్యూరురూరల్: జ్ఞాన జ్యోతి శిక్షణలో పంచకోస విధానంపై అంగన్‌వాడీలు మరింత అవగాహన పెంచుకోవాలని ఉయ్యూరు ఎంపీడీవో శేషగిరిరావు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఐదు రోజులుగా జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా 120 రోజుల శిక్షణ వేర్వేరుగా జరగనుంది. శిక్షణలో భాగంగా 'నేషనల్ కరికులం ఫ్రేమ్ వర్క్ 2022' లో పొందుపరిచిన పంచకోస విధానంపై డీఆర్పీలు వివరించగా ఉయ్యూరు ఎంపీడీవో శేషగిరిరావు పాల్గొని ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల మధ్య వయసు పిల్లలకు సమగ్ర అభివృద్ధిలో భాగంగా వివిధ అంశాలను వివరించారు. అలాగే విద్యార్థికి బాల్య దశ నుంచి వారిలో ఉన్న శారీరక, సామాజిక, మానసిక భావోద్వేగాలు మేధాభివృద్ధిని వివరించాలని చెప్పారు. వారి అభివృద్ధికి పాటుపడితే చిన్ననాటి నుంచి పిల్లలు వారి శక్తియుక్తులను అభివృద్ధి చేసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ సరోజిని పాల్గొన్నారు.

ముగిసిన అంగన్‌వాడీల శిక్షణ తరగతులు

ఉంగుటూరు: మండలంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తల జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. కార్యక్రమంలో ఎంఈవో సాంబశివరావు, సీడీపీవో వెంకటలక్ష్మి, హెచ్‌ఎం అనిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బి.పద్మాదేవి, ఎల్.దుర్గాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన 'జ్ఞానజ్యోతి' శిక్షణా కార్యక్రమం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మెరుగైన బాల్య విద్యను అందించే లక్ష్యంతోనే 'జ్ఞానజ్యోతి' కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని బాపులపాడు ఎంఈవో శ్రీరామ్ బాలాసింగ్ చెప్పారు. స్థానిక నూజివీడు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు 'జ్ఞాన జ్యోతి' కార్యక్రమం కింద నిర్వహిస్తున్న 120 రోజుల సర్టిఫికెషన్ కోర్సు మొదటి దశ శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. వినూత్న పద్ధతుల్లో అభ్యసన కార్యక్రమాలు నిర్వహించటం, విద్యా నైపుణ్యాలు పెంపొందించటం, ఉత్తేజిత వాతావరణం సృష్టించటం అనే అంశాలపై అంగన్‌వాడీ టీచర్లకు ఎంఈవో తరగతులు బోధించారు. హెచ్‌ఎం తోట వెంకట నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శాంతి శిరీష, ధనలక్ష్మి, డీఆర్పీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ లైన్లకు మరమ్మతులు నిర్వహించారు. ఆ గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు కిందకు వాలి విద్యుత్ పరమైన సమస్యలు తలెత్తుతున్నాయని ఫిర్యాదులు అందడంతో మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు మాట్లాడుతూ.. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మకంగా మారిన లైన్లను గుర్తించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయా గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా విద్యుత్ సరఫరా అందిస్తున్నామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, ఫ్యూజు బాక్సుల వద్ద రక్షణ కవచాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వేసవిలో తరుచూ జరిగే విద్యుత్ ప్రమాదాలపై ఆయా గ్రామ ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అనధికారకంగా విద్యుత్‌ను వినియోగించడం చట్టరీత్యా నేరమన్నారు. విద్యుత్ అధికారులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యుత్ అక్రమ వినియోగం, అదనపు లోడు, మల్టిపుల్ సర్వీసులు కలిగి ఉన్న వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నట్లు ఏఈ చెప్పారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలి

నున్న(విజయవాడరూరల్): గ్రామాల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి, చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలకు చెత్తను తరలించాలని విజయవాడ రూరల్ మండల ఈఓఆర్డీ ఎండీవీ ప్రసాద్ అన్నారు. నున్న గ్రామంలో విజయవాడ రూరల్, జి.కొండూరు, విసన్నపేట మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులకు, గ్రేడ్ 5 కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులకు చెత్త నుంచి సంపద సృష్టించడంపై మంగళవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈఓఆర్డీ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద సృష్టించే దిశగా చెత్త డంపింగ్ కేంద్రాలు పని చేయాలన్నారు. క్లాప్ మిత్రలు ప్రతి ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేరు చేసి కేంద్రాలకు తరలించాలని తర్వాత వర్మీ కంపోస్టు ఎరువులను తయారు చేసి విక్రయించడం ద్వారా ఆదాయం సమకూరుతుందని చెప్పారు.

సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు

రూరల్ ఎంపీడీఓ(ఎఫ్ఏసి) పి.మురళీకృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలంటే గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ త్రికరణ శుద్ధిగా జరగాలన్నారు. ప్రతి ఇంటికి తడి, పొడి చెత్త వేసే బుట్టలను పంపిణీ చేశామని, వాటిని ఉపయోగించి వేర్వేరుగా చెత్త సేకరించి, వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించాలన్నారు. స్వర్ణాంధ్ర సాధన కోసం అందరూ కలిసి సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని జి.కొండూరు మండల ఈఓఆర్డీ కె.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీతిరుపతమ్మ కల్యాణ వేదికకు విరాళాలు



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ దేవస్థానం ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న కల్యాణ వేదిక నిర్మాణానికి మంగళవారం పలువురు భక్తులు రూ.1.50 లక్షలు విరాళాలను ఇచ్చారు. గన్నవరానికి చెందిన ఉప్పలపాటి శ్రీనివాసరావు, ఆయన సోదరీమణులు నాగఉషారావు, రాజరాజేశ్వరి సంయుక్తంగా రూ.50 వేలు అందజేశారు. కాసన్నేని కోటేశ్వరరావు, పద్మజ దంపతులు రూ.50 వేలు, వేమూరి శ్రీనివాసరావు దంపతులు రూ. 50 వేలు విలువైన గ్రానైట్‌ను ఇచ్చినట్లుగా ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. భక్తులందరి సహకారంతో త్వరితగతిన శ్రీతిరుపతమ్మ కల్యాణ వేదికను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.

మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి



నున్నలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నున్న(విజయవాడరూరల్): మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని మానసిక వికాస కేంద్రం జోనల్ కో ఆర్డినేటర్ ఎస్. జాకబ్‌రాజు తెలిపారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో నున్న సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాకబ్‌రాజు మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు తీసుకోవడం వలన భవిష్యత్తుతో పాటు మీ కుటుంబ సభ్యులు ప్రమాదంలో పడతారన్నారు. మత్తు పదార్థాలైన ఆల్కహాల్, పొగాకు, గంజాయి లాంటి వాటి వినియోగం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు తలెత్తుతాయని చెప్పారు. మత్తు పదార్థాలతో బతుకు దుర్భరం చేసుకోవద్దన్నారు. అనంతరం నీతోడు మానసిక కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ ఎన్. దేవమణి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలను, యువతను డి-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని చెప్పారు. నవజీవన్ బాల భవన్ సంస్థ నూజివీడు మండలం పోలసానిపల్లిలో బోస్కో డి-ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసిందన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్ 94904 92020కు సంప్రదించాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ థెరిసా తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

గన్నవరం: ఈ నెల 27న జరగనున్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని గన్నవరం తహసీల్దార్ వెంకటశివయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ...గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల కోసం గన్నవరం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో నాలుగు పోలింగ్ కేంద్రాలు, బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో మూడు, ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు మండలాల్లో మొత్తం 7,390 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా, అందులో గన్నవరంలో 3,528, బాపులపాడులో 2,628, ఉంగుటూరులో 1,234 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అర్హత కలిగిన పట్టభద్రుల ఓటర్లు తమ ప్రాధాన్యతను చాటుతూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఓటర్ తమ ఓటర్ ఐడీ, ఆధార్, ఇతర గుర్తింపు కార్డులకు సంబంధించి ఏదో ఒకటి పోలింగ్ కేంద్రానికి వెంట తీసుకురావాలని సూచించారు.

ఉయ్యూరు మండలంలో 2,805 మంది గ్రాడ్యుయేట్లు

ఉయ్యూరురూరల్: ఉయ్యూరు పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో 2,805 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారని ఉయ్యూరు తహసీల్దార్ సురేష్ బాబు తెలిపారు. ఈ నెల 27న కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నిక జరుగతుందన్నారు. దీనిలో భాగంగా ఉయ్యూరు జిల్లా పరిషత్ పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలున్నాయని చెప్పారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో అన్ని సౌకర్యాలు కల్పించామని, ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

పెసర పంట దగ్ధం

ఉంగుటూరు: ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి మూడు ఎకరాల పెసర పంట అగ్నికి ఆహుతైన సంఘటన పొట్టిపాడులో మంగళవారం చోటుచేసుకుంది. పొట్టిపాడు గ్రామానికి చెందిన బాలాజీనాయక్ అదే గ్రామంలో టోల్‌గేట్ సమీపంలో 10 ఎకరాల్లో పెసర పంటను సాగు చేస్తున్నాడు. పక్కపొలం రైతు ఫోన్ చేసి మీ పొలంలో మంటలు వ్యాపించాయని చెప్పాడు. గన్నవరం అగ్నిమాపక బృందం సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపు చేశారు. అప్పటికే మూడు ఎకరాల్లో పంట అగ్నికి ఆహుతైంది. రూ.1.20 లక్షలు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడి చెబుతున్నాడు.

పారిజాతం పుష్పాలతో శివయ్య రూపం



పారిజాతం పుష్పాలతో రూపొందించిన శివయ్య రూపం ఆకట్టుకుంది. మహాశివరాత్రి సందర్భంగా యనమలకుదురుకు చెందిన నడకుదిటి సుజాత శివయ్యను పుష్పాలతో తీర్చిదిద్దారు.

– మొగల్రాజపురం(విజయవాడతూర్పు)

కరాటే విజేతలకు అభినందన



పతకాలు సాధించిన క్రీడాకారులు



సాత్విక్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం హరిశరణ్, పీడీ శాంతి కిరణ్

గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న బద్రి సాత్విక్ టీమ్ కటాలో స్వర్ణ పతకం సాధించాడు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఈ నెల 23న జరిగిన జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఆలిండియా ఓపెన్ కరాటే డో చాంపియన్ షిప్–2025 పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. సాత్విక్‌ను మంగళవారం పాఠశాలలో హెచ్‌ఎం కె.హరిశరణ్ ఆధ్వర్యంలో ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తేనే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదుగుతారని చెప్పారు. పీడీ బి.శాంతి కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ఉయ్యూరు విద్యార్థుల సత్తా

ఉయ్యూరు: కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ఉయ్యూరు విద్యార్థులు సత్తా చాటారు. చిలకలూరిపేటలో శ్రీ వెంకటేశ్వర ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఎల్‌కే పనకోసి చోటాకాన్ కరాటేడో అసోసియేషన్ ఆధ్వర్యంలో జవహర్ లాల్ నెహ్రూ మెమోరియల్ ఆలిండియా కరాటే చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఉయ్యూరు నివాస్ కరాటే అండ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా విద్యార్థులు చాంపియన్‌షిప్‌లో పాల్గొని పతకాలు సాధించారు. వివిధ విభాగాల్లో జె.సాయిశ్రీవల్లి, అక్షయ, వై.శ్రీదేవి, ప్రవీణ్, అయ్యన్, జె.కార్తీక్, పి.పునీష్, తదితరులు పతకాలు సాధించారు. విద్యార్థులను, కోచ్ శ్రీనివాస్‌ను ఏజీఅండ్ ఎస్‌జి సిద్ధార్థ జూనియర్ కళాశాల డైరెక్టర్ జీజేపీ వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి మంగళవారం అభినందించారు.

కరాటేలో రాణించిన హెచ్‌ఎంకే విద్యార్థులు

కంకిపాడు: జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్‌లో గోసాల హెచ్‌ఎంకే విద్యార్థులు తమ సత్తా చాటారు. పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ ఆర్.వసంత్‌కుమార్, ప్రిన్సిపాల్ ఆర్.సుక్‌మిత్ కౌర్ మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు జిల్లా చిలకలూరి పేటలో శ్రీ వెంకటేశ్వర ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కరాటే కుంగ్‌ఫూ జాతీయ స్థాయి చాంపియన్‌షిప్ ఇటీవల నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో బి.వశిష్ఠ సాయి, వి.తరుణ్‌శేఖర్, కె.లోహిత్, ఎం.బాలసాయి, ఎస్.ప్రేమ్‌కుమార్ ప్రథమ బహుమతి సాధించారన్నారు. కె.సాయి నాగ మణికంఠ, కె.రెహమాన్ ద్వితీయ స్థానం సాధించారన్నారు. సత్తా చాటిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన కోచ్ డి.రామాంజనేయులును ప్రత్యేకంగా అభినందించారు.